సత్యం

అల్లం రాజయ్య

"నా కెందుకనో బుగులుగున్నది... ఎనుకటి నుంచి బతుకుతలేమా? ఏడి నుంచి ఏడికత్తదో? ఇసప్పురుగుతోని సెలగాటమాడుతండ్లు– ఎవల సిరసు మీన గొత్తదో గదా!" పున్నమ్మ గడుప మీన కూర్చుండి మొగన్ని చూస్తూ ఇలాగా చాల సేపటినుండి సణుగుతోంది....

మొగుడు నారాయణ, భార్య పున్నమ్మ ముఖంలోకి తలెత్తి ఒక నిముషం చూశాడు... తల దించుకొని గ్యాసునూనెలో గుడ్డముక్క ముంచి చేతులున్న తుపాకిని తుడుస్తున్నాడు.

"నా మాటకు సిన్నమెత్తు ఇలువ లేకుంటయిపోయింది. అప్పటినుంచి లడలడ నేనే అదురుతన్న– మాట్లాడ్తె నోటి ముచ్చాలు రాలిపోతయా? సంఘాలు గింగాలని నువ్వు దిగి మా నోట్లె మన్ను బోత్తవుగని బ్రతిమీన గురిసిన అన... ఉలకవు పలుకవు..."

---

ప్రబలంగా ఉంది. దీనివల్ల ఇంకో చెప్పుకోదగ్గ మార్పు జరిగింది. పూర్వం వచన కవిత్వం రాసే కవుల్లో అల్ప చమత్కారాలకీ, వైచిత్రికీ, కొద్దిపాటి సెటైర్‌కీ లొంగి పోయిన లక్షణం కన్పించేది. అంతేకాని, పాటల్లో కన్పించేంత "సీరియస్ నెస్" కన్పించేది కాదు.

ఇదే సందర్భంలో విరసం నుంచి చీలిన కొందరు, ఇతరులు మరికొందరు కలిసి ఏర్పడిన "జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య" గురించి కూడా చెప్పుకోవాలి. ఈ సమాఖ్యవారు "జనం పాటలు" అనే పాటల పుస్తకం వేసారు. "వర్గశత్రు నిర్మూలన" అనే అంశాన్ని వదిలేస్తే వీళ్ళ రచనలకీ, విరసం వాళ్ళ రచనలకీ మధ్య చెప్పుకోదగిన వైరుధ్యం లేదు. విరసం కవుల్లో కూడా కొందరు వర్గశత్రునిర్మూలన సిద్ధాంతాన్ని ఆమోదించరు కాబట్టి, వాటి మధ్య భేదం మరింత పల్చబడింది. సాహిత్య మార్గాల్లో, విశిష్టమైన జనసాహితీ సమాఖ్య మార్గం అంటూ ఏర్పడలేదు. సాహిత్య రంగాన్ని అత్యంత ప్రభావితం చెయ్యగలిగిన శక్తిని ఈ సమాఖ్య ఇంకా కూర్చుకున్నట్టు లేదు.

అందువల్ల 1970– 80 మధ్య దశాబ్దంలో సాహిత్యాన్ని నిజంగా ప్రభావితం చేసింది, విరసం, దాని సోదర సంస్థ జననాట్యమండలి. ఈ సాహిత్యాన్ని ప్రదర్శనల ద్వారా జననాట్యమండలి ప్రచారం చేస్తే, అచ్చులో "సృజన" ప్రచారం చేసింది. అందుచేత ఈ పదేళ్ళ కాలాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో విరసం, జననాట్యమండలి సృజన అనే మూడు ఉమ్మడిశక్తుల యుగంగా గుర్తించవచ్చు.

"అయ్యిందా ? ఇంకేమన్నా ఉందా ?" అప్పుడు నారాయణ నోరు విప్పాడు.

తల్లిని, తండ్రిని చూస్తూ కూర్చున్న కృష్ణకు వాళ్ళ మాటలు అర్థం కాలేదు. కుంపటి తిత్తి ఒదిలిపెట్టి తండ్రి దగ్గిరికి జరిగాడు... గుడిసె బయట కూర్చున్న క్రిష్ణ తమ్ముడు సత్యం గూటికి చేరుతున్న కోడిపిల్లలతో ఆడుతున్నాడు.

"నాయిన్నా గిదీన్నే మంటరే..." క్రిష్ణ తుపాకి చివరి బొడిపె చూయిస్తూ అడిగాడు.

"నిశానంట్రా-"

"గిదేం పని జేత్తది-"

"ఇగో గీడున్న రింగుల నుంచి నిశానును, మనం కొట్టేదాన్ని మూడిటిని ఒక్క లైనుకుబెట్టి సూసి దెబ్బగొడితే తప్పిపోదు."

క్రిష్ణ తనో గుడ్డముక్క తీసుకొని తుపాకిని తుడువసాగిండు...

"నేనే మడుగుతన్న- నువ్వేం మాట్లాడ్తన్నవ్- ఆఖరుకు" పున్నమ్మ కోపంగా లేచి నిలబడ్డది. ఆమె ముఖంలోకి రక్తం చిమ్ముకొచ్చింది. ఎర్రరాయి ముక్కుపుడక మరింత ఎర్రగా మెరిసింది...

"మీ నోట్లె ఇషం బోత్తనంటవ్... అంతేగదా" నారాయణ తుపాకి పూర్తిగా క్రిష్ణ కిచ్చేసి చేతులు గుడ్డతో తుడుచుకుంటూ అన్నాడు.

బజారులో ఇండ్లకు చేరుతున్న పశువులు అరుస్తున్నాయి- దుమ్ము వాసన వేస్తోంది

నారాయణ లేచి నిలబడి గుడిశె ముందటి కొచ్చాడు... పశువుల వెనుక ఈడ్చుకపోయిన మొఖాలతో, దుమ్ము నిండిన ఒళ్ళుతో చింపిరి గుడ్డల పశువుల కాపర్లు పశువుల నదిలిస్తూ నడుస్తున్నారు ఆవులు లేగల కోసం ఒర్లుతున్నాయి- ఎక్కడి నుండో లేగ గొంతు ఆఃలితో చాలా హృదయవిదారకంగా అరుస్తోంది. తూరుపు ఆకాశం మీద చుక్కొకటి మినుకు మినుకు మంటోంది.

పున్నమ్మ దీపం ముట్టించి అడ్డగోడ మీద పెట్టింది. దీపం వెలుగులో పున్నమ్మ ముక్కుపుడక ఎర్రరాయి కాంతివంతంగా మెరుస్తోంది.

నారాయణ చూరుకింది నులకమంచం వాల్చుకొని చేతులు తలకింద బెట్టుకొని వెల్లికిలా పండుకొని చింతల మీద నిలిచిపోయిన మబ్బు తునకల వేపు చూసిండు.

పున్నమ్మ గుడిశె బయటకొచ్చింది- గొంతు తగ్గించి-

"ఎవలెక్కడ బోతె మనకేంది? బలిరె మన్నెపోడా! అంటె బండిగిరె మీనేసుకొని సచ్చిండట నీ అసొంటోడు, మనకండ్ల ముంగట సింతకింది పోశన్న కొడుకు లచ్చింమల్లు సంఘంల జేరిండని– దొరేం జేసిండు? నోల్లెకచ్చిన జొన్న సేను గొడ్ల మేపిచ్చిండు. పోశన్నను జేలుకు పట్టిచ్చిండు. సిన్నగాక మొన్న పసులు బందుబెట్టిన పాలేరొల్లను పోలీసుల బిలిపిచ్చి తన్నిచ్చిండు. నామాటిను. దొర నిన్నింకా తన మనిషే అనుకుంటండు. నువ్వు గిట్లని తెలిసిందా? మామ కాలం లిచ్చిన ఇనాం భూమి గుంజుకుంటడు. మనకు గీఊశ్కెమున్నది. సేసుకుంటె తిన్నట్టు లాపోతే పన్నట్టు– నీ నగలు న్కటా ఎవలు సేయించుకుంటరు. దొరను కాదని మనం బతుకలేం."

"ఎప్పటికి నీ ముచ్చట నీదేగని—కూసంత ఇసారం జేసేవా? దొర భూమి మనకు పుక్యాని కియ్యలే–ముప్పయేండ్లనుంచి నగలు జేసిచ్చినం–సిన్నపనికి పెద్దపనికి కుక్కతీర్గ ఎంట తిర్గిన– అయినా గభూమి ముప్పయేండ్లనుంచి మనమే కాస్తుజేస్తన్నం ఆదెవ్వడు మజ్జెన గుంజుకోను. దొరలు పుట్టినప్పుడే బూములు ఖజానేసుకొని పుట్టలే ఊరు ఊరంతా కాష్నాల గడ్డయిపోతుంటే నీ ఏడుపు నీదే—రేప్పొద్దుగాల నువ్వు సెప్పులు నాకినా ఇడిసి పెట్టడు–ఝూడిచ్చి ముడ్డిమీన తంతడు. పిస్సదానా గాలత్తె అన్నిసెట్లను, ఆకులను ఊపుతది. నేనూగనని ఏ ఆకు మూలకూకుసున్నా అది ఇడిసి పెట్టది."

"ఓ నారన్న. అతారే రడీ జేసినావే. ఇయ్యాల దొరా, అమీన్‌సాబ్ మాలె గట్టుకు సికారు బోతరట. నన్ను పట్టుకరమ్మన్నాడు." తెనుగుగట్టయ్య వచ్చి వాకిట్లో నిలుచున్నాడు.

ఏదో చెప్పాలని నోరుతెరిచిన పున్నమ్మ నోరు మూసుకొని కూర్చున్నది.

"ఇగో ఇప్పుడే సాపుజేసి గిట్ల నడుంవాల్సిన– నువ్వు రానేవత్తివి. నేనే తెత్తా మనుకుంటున్న...ఏదీ...ఈమజ్జెన కస్రత్తలేనే లేవ్– ఎటన్నబోయివవా? కూకో... పున్నీగట్టన్నకు జెరన్ని మంచి నీల్లు దెచ్చియ్యి.." నారాయణ మంచంలో లేచి కూర్చున్నాడు.

గట్టయ్య వాకిట్లో నేలమీద కూర్చుండి షికారు సంగతులు చెప్పుకొస్తున్నాడు. తను ఎన్నెన్ని జింకల, అడివి పందుల, మెకాల ఎట్లెట్ల గురి చూసి కొట్టింది చెప్పు కొస్తున్నాడు. జంతువుల స్వభావం గురించి, కదలికల గురించి చెప్పుకొస్తున్నాడు.

"అయితే.. దొరగారు నీకెప్పుడన్న ఏటమాంసంల కూసంతన్న ఇచ్చిండా" నారాయణ..

1667

గట్టయ్య "ఓసి నీకు గింత తెల్వదా?" అన్నట్టునవ్విండు..నవ్వి

"దొర కూర నాకెందు కిత్తడు ?"

"నువ్వు కొట్టినవ్ గన్క"

"తుపాకి దొరదేగద.."

నారాయణ మాట్లాడలేదు...

"కూరగాదు-కూలైమన్న బొయ్యకుంటె అంతే సాలు.. ఇన్నొద్దులు సెరువు ఏలం నన్నాదుండేది. ఇయ్యేడు ఎయ్యిన్నర జెసిండు. జిమ్మలు బట్టి అమ్మక బతికే టోల్లం గన్ని పైసలెక్కన్నుంచి తెత్తమ్..కాదు కక్కుసమంటె పొరుగూరోల్లను దీసు కొత్తడట-అదికి ఏటా మేం గోసుకుని గుడెసెలు గప్పుకునే తుంగకోపిచ్చి అమ్ము కున్నడు..దొరలు గిట్ల కోతుకం జేత్తే ఏద బతుకుతం..మాట్లాడ్తె ఖస్సుబుస్సు మం టండ్లు. దొరా! ఎవలిని నమ్ముతలేదు. మనం మొదటి నుంచి మొదటి దనుక దొరను నమ్ముక బతికినోల్లం! గిప్పుడు దొరను కాదని సంఘంగింగమని బతుకుతాం ! దొరే జర ఇసారం జేయాలెగని.."

నారాయణ గట్టయ్యను చూసిండు. దీపం వెలుగు చారలా అతని మీద పడు తోంది. కండలు దిగిన శరీరం బానకడుపు-బుగ్గమీసాలు-"మనిషి సెత్త దున్నపోతు సెత్తె-మెదడు గంతే ఏంభాగ్గెం" మనసులో అనుకొని పైకి మాత్రం.. "బానిచ్చుమే.. దేనికైనా దమ్ముండాలె గట్టన్నా.." అన్నాడు.

"ఇగనేం బోత. ఆలిశ్యమైతే దొర పంచాంగ మిప్పతడు." గట్టయ్య లేచి నిలుచున్నడు.

"కిట్టన్నా గతుపాకిదెచ్చి మామ కియ్యి." నారాయణ.

లోపలి నుండి జవాబు లేదు.

"కిట్టా."

పున్నమ్మ గుడిశె లోపల తిడుతోంది.

"నెగులబుట్టసిపోడా ! తుపాకంత ఇచ్చి కుప్పబెట్టినావ్." ఆ తరువాత వీపు మీద దెబ్బవేసినట్టున్నది. కొంచెం సేపటికి క్రిష్ణ తుపాకి గుండులా గుడిశెల నుండి దూసుకవచ్చి బజారు వెంట పరుగెత్తసాగిండు. అన్న వెంటపడి సత్యం పరుగందు కున్నడు.

నారాయణ గొనుగుతూ లోపలికి నడిచిండు. లోపల తుపాకి ఏ కీలు కా కీలు విప్పదీసి ఉన్నది.

"చూడవోతే వీడు తుపాకీ తయారు చేసేట్టుగున్నడి " నారాయణ.

"అయ్యె తాళ్లతొవ్వబడితె - కొడుకు శీనుల తొవ్వన్న బట్టడా ?" పున్నమ్మ

మరో పది నిమిషాల్లో నారాయణ తుపాకి సరిచేసి గట్టయ్య చేతికిచ్చాడు.

ఆ రాత్రి పిల్లలిద్దరు ఇంటికి రాలేదు.

× × ×

చాకల్ది ఊరు తిరిగిపోయింది. ఆకాశంలో చుక్కలను కప్పేస్తూ కర్రావు పొదు గోలె మబ్బులు- చిమ్మంజీకటి- చాలా గుడిశల్లో దీపాలు వెలగడం లేదు. ఊరి చివరి నున్న మాదిగగూడెంలో కుక్కొకటి ఉండి ఉండి నీర్సంగా మొరుగుతోంది. ఎవడో భూలక్ష్మి పందిరి కింద దుమ్ములో కూలబడిపోయి జీరగొంతుతో "లెల్లే లెల్లే లెల్లాయిలో దంగులు గొట్టి బంగులలు గట్టిసమని" పాట పాడుతున్నడు. ఊరి మధ్యలో ఒక స్త్రీ ఎప్పుడూ తెగిపోని గొంతుతో ఏడుస్తోంది. ఆ ఏడుపులో రాగం తప్ప మాటలు లేవు- తెనుగు గట్టయ్య బాగా తాగి తూలుతూ ఊరు పేరు లేకుండ తిట్టుకుంటూ ఎటో పోతున్నాడు.

"బతుకవ్వను కుక్కల్, ఏం బతుకు. గరీబోడు బతుకద్దు... అని గొంతికె లింత ఎండ్రిన్ బొయ్యిండ్లి. వారీ ! గట్టిగ నీ బతుకేం బతుకోంటా ? ఊరుతోని గలువవు- ఆళ్ళ సెప్పులు నాక్కుంట తిరుగుతవ్. థత్ తెరె- నాకేందిర ఊరుతోని పని. నా తల్లి లొట్టి సల్లగుంటెసాలు. ఎవడాడు కల్లుముంతో తల్లీ ! నిన్ను మరువ జాలనే. ఎందుకేడు త్తన్నవే ? నా తీరు బతుకు తె గీ తిప్పలచ్చేనా ? దొరంటే దొర గాదు ధరినికి దొర ! దొరకెదురు తిరుగుతె ఏమయ్యిద్ది. ఊకో బిడ్డా ! ఊకో."

ఇలాగా వదురుతూ నడుస్తున్నాడు.

ఎవరో బక్క పలుచటి మనిషి ఎదురుగా వచ్చినవాడు కాండ్ర కిచ్చి ఉమ్మేసి తప్పుకొని కదిలి పోయిండు. గట్టయ్య సిలదొక్కుకొని ఏదో అనాలనుకున్నాడు.. కాని మాట పెకలకముందే చింతవేరు తట్టుకొని ముక్కు మూసుక పడిపోయిండు. లేవాలని చాలా సేపు ప్రయత్నించి లేవలేక దుమ్ములో కాసేపు పొర్లి అక్కడే నిద్ర పోయాడు.

చీకటి మరింత చిక్కబడ్డది.. ఊరులుకుమగ్గిపోయింది.. గుడిశెల్లో గుసగుసలు మొదలయ్యాయి. ఒక్కొక్కరే తలనిండా ముసుగు పెట్టుకొని చెరువు కట్టవేపు నడు స్తున్నారు. చెరువుకట్ట మధ్యలో ఉన్నగంగరావి చెట్టుకింద కుప్పకూడిండ్లు.

చెట్టుమొదట లచ్చయ్య కూచ్చుండి గడ్డం బరుకూ బరుకున గోక్కుంటున్న వాడు-ఏదో ఆలోచిస్తూ "రావాల్సినోల్లంత అచ్చినట్టేనా ?" అన్నాడు. దూరంగా కూలబడుతూ వెంకటనర్సు "ఆఁ అందరచ్చి నట్టె.." అన్నాడు.

చెరువులోకా తనీరు తెల్లగా కన్పించడంలేదు. అలలు కట్టకేసి కొట్టుకొని విరిగి పడు తున్న సప్పుడు మాత్రం విన్పిస్తోంది..

"బొందిగెల దనక సీల్చిసరు. ఎనుకదారి బందయి పోయింది. మళ్ళింక ఉన్న దొక్కటేదారి–సావయినా రేవయినా ముంగటికే పోవుడు. మన సంఘ పెద్ద భీమన్నను పోలీసోల్లు పట్టుక పోయిండ్లు–ఎనకా ముంగట ఇసారం జేసుకోవాలె మనమే. ఊళ్ళెజొచ్చి పోలీసోల్లు ఆదునుకు దొరికి నోన్నల్ల మోటరెక్కిచ్చుక పోయిండ్లు–జమానతు పడి ఆళ్ళ నిడిపిచ్చుక రావలె–అదట్టుంచుండ్లి గిట్ల జేసుడు దొరకు [1]బనావు గాదని రేపు పిల్లా జెల్లా అందరం ఊరేగింపు తీయ్యాలె–ఇవ్వారకే పది దినాలయ్యింది, పనులు బందు పెట్టి–మొగ[2]కయికిలి 5 రూపాలు, ఆడకయికిలి 3 రూ॥ ఇచ్చేదనుక అన్నిపనులు బందే. ఇంకోటి సుత ఉన్నది," లచ్చయ్య కాసే పొగాడు.

"లచ్చన్న మామా సిబాంచెన్.. ఆడ అయినెను ఏంజేత్తండ్లో పోలీసోల్ల సేతికి దొరుకు దంటె ఎముల్లోల్ల సేతికి దొంకినట్టె.." భీమన్న భార్య రాజేశ్వరి కొంచెం ముంగటికి జరిగి చెప్పింది.

"నువ్వేం[3]బుగులు పడకే బిడ్డా! భీమన్న పానానికి మాపానం ఎదురిత్తం." రాములు రాజేశ్వరి తలమీద చేయేసి దువ్విండు..

"గియ్యన్ని ఓఎత్తు.. సెరవు ముంగటి పరంపోగుల నాగండ్లు కట్టటం ఒక ఎత్తు" సాంబయ్య.

"దెబ్బోంగండ్లేం బండుతయి. అట్టి దొక్కలకు [4]కోం(డిగాడు దెబ్బలు–దిన్నట్టు కులం సెడ్డా సుఖం దక్కాలె–సెర్వేనుక అందరు పొలంలనే నాగండ్లు కట్టాలె–గది సాకలోల్ల [5]మాన్నెంగద దొర సానేండ్లనుంచి దున్నుకుంటుండు." రంగయ్య చిరు బురు లాడిండు.

"ఎక్కన్నుంచచ్చిందిరో తెలివి. మందిని ముంచేతెలివిగాదు గదా!" సాంబయ్య.

రంగయ్య చీకట్లోనే చేతులు తిప్పుతూ. "నిచ్చమే నేను దొర పాలేరోన్నే, గిప్పటినుంచే సంఘంల జేరుదామనచ్చిన"

"బిడ్డా! నువ్వా గరీబోనివే కాపన–కని గిడిమాట పొక్కిందో ఎట్లేగదా! మా కడుపు మండిపోతంది." లచ్చయ్య.

"గసొంటి పనికెత్తుకుంటే నేను మా అయ్యకు బుట్టనట్టే." రంగయ్య

"ఒట్టుగాదుమాగ్గావలసింది. పని." నారాయణ.

"నీకెర్కలేదానె నారన్న నా సంగతి." రంగయ్య.

1670

1. న్యాయం 2. కూలి 3. భయం 4. తోడేలు 5. ఇనాము భూమి.

"సరే! పరంపోగు దున్నాలె." లచ్చయ్య కాసేపాగి "ఊరేగింపు రేపొద్దుగాల కాకుంట మాపున తీత్తాము. పొద్దుగాల నాగండ్లు గడుదాం. నారయ్యా నువ్వు సాంబయ్య [1]మునొస్సికిచ్చీరుకు బోండ్లి. అడ మనమనుషులు గలుత్తరు. మేం ఈడి పని జూసుకుంటం." లచ్చయ్య.

కాసేపు తరన భర్జనలు జరిగినయ్.

అంతవరదాకా మౌనంగా ఉన్న ఆకాశం గడగిడలాడింది.

"ఛక్! ఛక్" మని మెరుపులు మెరిశాయి. కాసేపటికి టపటప చినుకులు రాలాయి. మబ్బుల్లాగా దడదడలాడుతున్న గుండెలతో, మెరుపుల్లాంటి ఆశలతో కొందరు–వర్షంలాగా మౌనంగా ఏడుస్తూ మరికొందరు గుడిశెలు చేరుకున్నారు.

ఆ రాత్రంతా వర్షం కురుస్తూనే ఉన్నది. నారాయణ మంచంలో వెల్లకిలా పండుకొని ఆలోచిస్తూనే ఉన్నాడు. పున్నమ్మ ఇద్దరు పిల్లలను గుండెల కదుముకొని చప్పుడు కాకుండా ఏడుస్తూనే వున్నది.

"పున్నీ! ఇవ్వాళ్టదనుక మాండటికి అచ్చే పని జల్లే! మనోల్లంత జేల్ల కూకున్నరు. రాయేశ్వరక్క గొడ్డొగ్గినట్టు ఒర్రుతంది. నాకేమయ్యిందని సచ్చినోని కేడ్సినట్టేడుత్తన్నవ్. ఆ దినం బిడ్డ పెండ్లికి బంగారుగాజులు యాల్లకు అందియ్యలేదని జెరంతోనున్నానని సూడకుంట పెయ్యంత పెట్టన పేల గొట్టిన్నాడు ఏమన్నవో గుర్తుకు దెచ్చుకో? మంచిసీల్ల బాయి కాడ నవ్వు గీ ఊరచ్చిన కొత్తల దొర కొంగు బట్టిన్నాడు నువ్వు ఏమన్నవో గుర్తుకు దెచ్చుకో? మన బతుకుల దొరెంత మన్ను వోసిండో నా నోటి మీసికెల్లెందుకు సెప్పిత్తవు? అయినా నీ పిచ్చిగాని నేను లేకుంటే సంఘపోల్లు ఊకుంటరా? అరదసీల్లు సాగినయ్. అండ్ల మనం గల్సుడేగని. మనం లేకుంటే గనీల్లు అగుతాయే!" నారాయణ రాత్రంతా ఇలాగా గొణుగుతూనే ఉన్నాడు.

క్రిష్ణ, సత్యం కండ్లు చికిలించి చీకట్లోకి చూస్తూ వర్షపు చప్పుడు, తండ్రి మాటలు విన్నారు. కాని వాళ్ళకేమి అర్థంగాలేదు.

కోర్టు పని మీద పోయిన నారాయణ గుడిశె చేరుకునేసరికి సూర్యుడు పడమటికి బాగా వంగిపోయాడు. తలుపు కతుక్కపోయి పున్నమ్మ ఎదురు చూస్తోంది.

నారాయణ ఇంట్లో అడుగు పెట్టడంతోటే పున్నమ్మ గడగత చెప్పడం సాగించింది.

"నాగండ్లు గట్టబోయిన సంఘపోల్ల మీనికి దొర పట్నం నుంచి లాగులోల్ల తీసుకచ్చి తొలిచ్చిండు పదిమంది పుర్రెలు బలిగినయ్. గుడిసెల్ల జొచ్చి పిల్లా

1. కోర్టుకు

1671

జెల్లాముసలీ మతకా అని సూడకుంట గుంజి కొట్టిండ్లు. ఊరంత కొట్టుకోల్లు మొత్తుకోళ్ళు ఏడ్పులు పెడబొబ్బలు అని ఉప్పాత మూడ్సుకపోను. లావుసెల్లిచ్చు కుండు సెడిసెల్లిచ్చు కున్నోల్లంత సెర్లకేపోతరు" పున్నమ్మ గుండెలు కోపంతో ఎగిరి పడుతున్నాయి.

నారాయణ కాసేపు భార్య ముఖంలోకి చూశాడు. పున్నమ్మ ఇంకా చెప్తూనే ఉన్నది. నారాయణ వినకుంటూనే కాళ్లు, చేతులు కడుక్కొని కుండలో నీళ్ళు ముంచుక తాగిండు.

భీమయ్య ఎగపోసుకుంటూ ఉరికచ్చిండు.

"నారన్న సత్తెనాశిడమయ్యింది." అన్నాడు భీమయ్య.

"ఆడు సేసేపని ఆడు జేత్తడు. జనం తెగిచ్చిన్నాడు సూడు" నారాయణ.

ఇంతలోకే సుంకరోడు గజ్జెల కట్టె ఊపుకుంటూ పరుగెత్తుకొచ్చి, భీమయ్యను చూసి నీళ్ళు నములుతూ నిలుచున్నాడు.

"ఏం దుర్గన్నా సంగతేంది?" నారాయణ.

"దొర నిన్ను జరూరుగ తోలుక రమ్మన్నడు."

"అత్తన్నపా." నారాయణ గుడిశెలో నుండి బయటకొచ్చాడు.

"గిప్పుడెందుకు ?" భీమయ్య.

"అన్నా అద్దని సెప్పు" పున్నమ్మ.

"నువ్వు లచ్చన్నను గలువు- నేను ఇక్కడున్నట్టె అత్త." నారాయణ బజారులోకి నడిచాడు.

పున్నమ్మ కెటూ పాలుపోలేదు. చాలాసేపు నారాయణ వెళ్ళినవేపే చూస్తూ నిలుచున్నది...మొదట తనూ వెళ్ళాలనుకొని వాకిలి దాటి, వెనుకకు తిరిగి క్రిష్ణను పిలిచి "నాయిన్నెంటబో - అదేమన్న జర్గేదుంటే జరూరుగ ఉరికిరా!" అని చెప్పింది.

క్రిష్ణ రివ్వున దొరింటివేపు దూసుక పోయాడు...

నారాయణ దొరింట్లో అడుగుపెట్టేసరికి దొర వెంకట్రావు పులితోలు కుర్చీలో పులిలాగే గురగుర లాడ్తూ కూర్చున్నాడు, అతని కళ్ళు ఎరుపెక్కి ఉన్నాయి. అతని కణతల దగ్గర నరాలుబ్బి ఉన్నాయి...

"నారిగా నీకు మదమెక్కిందిబే...నా ఉప్పు పప్పుదిని నామీనికే తయారయి నవా ? బంచత్ నేను తెలుసుకుంటే-ఒరే : లంజకొడుకుల్లాలా మిమ్ముల మీ

1672

సంఘాన్ని సీమల నలిపినట్లు నలిపిపారేత్త ఏమనుకున్నారో ?!" దొర గాండ్రిస్తు న్నాడు...

నారాయణ తల వంచు కొన్నాడు తలెత్తి దొరకళ్ళల్లోకి చూశాడు. నిజంగా ఆ చూపులకే శక్తుంటే దొర-దొరకుర్చీ మాడి మసై పోవాల్సిందే, అట్లా మసికాలేదు కనుక తాడు తెగిన బొంగు బద్దోలె దొరకుర్చీలో నుండి లేచాడు ..కాలు చెప్పుతీసి ఝాడిచ్చి నారాయణ దవడమీద కొట్టాడు... నారాయణ చేతులు బిగుసుకున్నాయి... మరోమారు కొట్టడానికి లేపిన చేతిని దించుకున్నాడు దొర ..

క్రిష్ణ పెద్దరువాజ దగ్గరే పిడికిల్లు బిగించి తలుపులను బాదుతున్నాడు...
దొరమొరగుతూనే ఉన్నాడు —

నారాయణ నోట్లో ఊరిన నెత్తురు ఊంచిండు...నెత్తురు సూసి దొర కండ్లు ఇంకా ఎరుపెక్కాయి...

"గీ దెబ్బ జవాబు సూసే దినమత్తది దొరా ! నారాయణ గిప్పుడు నీ గులాం గాదు సంఘపు మనిషి ." నారాయణ గిరుక్కున వెను దిరిగి పెద్ద పెద్ద అంగ లేస్తూ బయటకు నడిచాడు...

"గట్టిగా !" దొర గావుకేక పెట్టిండు. గట్టయ్య పరుగెత్తుకొచ్చే సరికే నారాయణ మూల మలుపు తిరిగాడు.

"ఏడికి బోతడు లంజకొడుకు-తొండముదిరి ఊసురవెల్లయ్యింది. వారీ ! పున్నిని గుంజినపుడు కాల్లు గడ్డాలు బట్టుకుంటివి గాదురా ! ఇగో గట్టిగ ఇయ్యాల్ల మాపున్నే ఈని ఎకురపొలంల నాగండ్లు గట్టుమను" తిడుతూనే ఉన్నాడు.

గట్టయ్య ఎటూ అర్థంగాక చేతులు నలుపుకుంటూ నిలుచుండి పోయాడు.

నారాయణ భూలచ్చిమి దగ్గెరికి వచ్చేసరికి అతనికి ఎదురుగా ఊరేగింపు వస్తోంది. దెబ్బలు తిన్నవాళ్ళు ముందు నిలుచున్నారు ఎవడో బాగా పొట్టిగున్నవాడు ఊరే గింపు ముందు ఛాతీ చరుచుకుంటూ వంగుతు లేస్తూ అరుస్తున్నాడు. ఇంకెవడో జనం మధ్య చేతి కర్రకు ఎర్ర రుమాలు కట్టి ఎగుర వేశాడు.

ఊరేగింపు ముందు క్రిష్ణ చిన్నారి గొంతు చిరిగిపోయేటట్టు ఆగకుంట అరు స్తున్నాడు.

ఊరేగింపు వెనుక బలహీనంగా జనం గొంతులో గొంతు కలుపుతూ పున్నమ్మ నడుస్తోంది.

ఊరేగింపు నారాయణను చేరింది. పొంగిన నారాయణ దవడ "ఏంజరిగిందో" భీమయ్యకు చెప్పింది.

1673

నారాయణ ఊరేగింపులో కలిశాడు. అతని కంఠం విచ్చుకుంది.

"దొరల జులుం నశించాలె."

"దున్నేవానికే " నారాయణ

"భూమి " పుడమి దద్దరిల్లింది. ఆకాశంలో మబ్బులు గడ గడ లాడాయి.

ఇందాకటి కురచ మనిషి ఏదో పాట ఎత్తుకున్నాడు, అందరూ ఆ పాటతో శ్రుతి కలిపారు

ఊరేగింపు వాడవాడలు దిరిగి దొరింటి ముందటి కొచ్చింది దొరగడి తలుపులు మూసున్నాయి.

"తన్నుండ్లి పీకుండ్లి" ఎవరో గుంపులోనుండి అరుస్తున్నారు.

"నీ సేతులకు జెట్టలు– నరుప్పులు బుట్ట– మా ముసలోన్ని సంపుతివి గదరో దొరోడా! నీ మందికి మార్నగాలం రాను! మా మీన ఇడిసి పెడితివి గదరో దొరోడా!" ముసలి స్త్రీ వణికే గొంతుతో భూమిని చరుస్తూ గోళ్ళతో మట్టిగీకి తలుపుల శేసి కొడుతుంది.

"దమ్ముంటే తలుపులు దీసి మాట్లాడు." నారాయణ గావుకేక పెట్టాడు. పున్నమ్మ వణికే కాళ్ళతో ఉరుకొచ్చి నారాయణ ఎత్తిన చేతిని పట్టుకున్నది.

కృష్ణ అప్పుడే తలుపుల ఎగబాకుతున్నాడు.

"ఈడికి పడిపారీలు తన్నులు గుద్దులు తిన్నం. ఇంటికొగన్ని జేల్లకు తోలిండు. ఏం సంగతో అరుసుకుందాం నడువుండ్లి" ఎవరో బొంగురు గొంతు రైతు పండ్లు గొరుకుతూ అన్నాడు.

"నీ కుక్క రంగన్ని సింతకు గట్టేసినం." ఇంకెవడో మొత్తుకున్నాడు

బంగళా పొంచున్న పెద్దపులి తీరుగ సడీసప్పుడు లేకుంటున్నది. పడమటి వేపు సూర్యుడు నెత్తుర కక్కుతున్నాడు. ఎర్ర రుమాలు రెపరెపలాడుతోంది.

క్రిష్ణ తలుపుల మీదెక్కి కూర్చున్నాడు

"నేను గొళ్లెంతీస్త." క్రిష్ణ తలుపుల మీది నుండే అరుస్తున్నాడు. క్రిష్ణ అవలి వేపు జారిండు బంగళా కిటికీ తలుపులు తెరుచుకున్నాయి క్రిష్ణ తలుపు గొళ్ళెం తీయడం, జనం తలుపులు తోసుకుని ప్రవాహంలా లోపలికి నడవడం ఒకేసారిజరిగాయి. కిటికీ తలుపుల్లో నుంచి తుపాకి మొరిగింది. క్రిష్ణ పక్కకు పల్టీ కొట్టాడు. క్రిష్ణ కోసం ఉరికిన నారాయణకు గుండు దెబ్బ తగిలింది.



1674

ఫల్లున నెత్తురు చిమ్మింది. "దున్నేవానికే భూమి" నారాయణ నెత్తురు మడుగులో గిలగిల కొట్టుకుంటున్నాడు.

ఇటు తిరిగిన క్రిష్ణ కళ్ళు నిలబడిపోయాయి.

తుపాకి మొరుగుతూనే ఉన్నది. జనం కూలుతూనే ఉన్నారు

ఒకరు- ఇద్దరు- ముగ్గురు- నలుగురు-

జనం వెనుదిరిగారు. కాళ్ళులాగిపోయినయ్. ఏడుపు గుండెల్లో ఘనీభవించిపోయింది. మౌనంగా శవాల మోసుకొని వెళ్ళిపోయారు. మబ్బుల ముఖాల మీద నెత్తురు పులిమి సూర్యుడు అస్తమించాడు. మూల మలుపు తిరిగిన తరువాత పున్నమ్మ గొంతు తెగిపోయింది. క్రిష్ణ తండ్రి శవాన్నే చూస్తూ మౌనంగా నడుస్తున్నాడు. అతని కళ్ళల్లో తాను తుడిచిన తుపాకి పొగలు కక్కుతూ కన్పిస్తోంది. తనవెంట నడుస్తున్న జనం కనిపించడం లేదు.

× × ×

ప్రభుత్వం ఆ తాలూకాను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించింది. గ్రామం నిండా పోలీసులు దిగిపోయారు. ఒంట్లో సత్తువున్నవాళ్ళు గ్రామం విడిచిపారిపోయారు. పారిపోలేని ముసలివాళ్ళు జేల్లకు పోయారు. ఆ ఊళ్ళో స్త్రీలు పిల్లలు మిగిలిపోయారు.

క్రిష్ణ రోజూ పోలీసుల టెంటు దగ్గరికి పోతున్నాడు. పోలీసులకు పిట్టకథలు చెప్పి నవ్విస్తున్నాడు. బూట్లు పాలిష్‌చేసి యిస్తున్నాడు. తుపాకులు తుడుస్తూ- గుడ్లు తేలేసి ఒక్కొక్క భాగాన్నే పరిశీలిస్తున్నాడు

దొర ట్రాక్టరు మనుషులను పట్నం నుండి తీసుకొచ్చుకొని భూములు దున్నిస్తున్నాడు. కిర్రు చెప్పులేసుకొని ఊళ్ళో తిరుగుతూనే ఉన్నాడు పున్నమ్మ ఒకనాడు దొర గడీకి ఈడ్చుక పోబడింది. కొనఊపిరితో ఉదయాన్నే గుడిసె చేరుకుంది. పిల్లలను దగ్గరికు తీసుకొని పగలంతా ఏడ్చింది. రాత్రి గుడిసెలు రవ్వలుకుంటాయి. రేపటి మంట కోసం చితికిన గుండెలు సమాయత్తమౌతాయి. "రేపు" పోలీసుల కరుకు బూట్ల కింద నిర్దాక్షిణ్యంగా నలిగిపోతుంది. మరో స్త్రీ దొరింటికి బలవంతంగా ఈడ్చుక పోబడుతుంది. పోలీసులు గుడిసెలు గాలిస్తారు. గూళ్ళల్లో నిద్రిస్తున్న కోళ్లను పట్టుకపోతారు. మంచాల మీద నిద్రిస్తున్న స్త్రీలను చెరుస్తారు. రోజూ గుడిసెలు రవులుకుంటూనే ఉంటాయి. తెల్లవారుతూనే ఉంటుంది. ...

× × ×

ఊరు నిశ్శబ్దంగా రాత్రి కడుపులోకి ఒదిగిపోయింది. పున్నమ్మ కుక్కి మంచంలో తెలివొచ్చి ఏడుస్తోంది. అస్పష్టంగా ఏవేవో మాటలు వినిపించి తల తిప్పి చూసింది.

1675

దీపం వెలుగులో క్రిష్ణ సుత్తితో మొద్దు మీద బెట్టి దేన్నో కొడుతున్నాడు. సత్యం పొయ్యిలో ఎగుస్తున్న నిప్పుల్ని చూస్తూ తిత్తి పిసుకుతున్నాడు.

పున్నమ్మ లేచి కొడుకుల దగ్గరకొచ్చింది. క్రిష్ణ పట్టుకారుతో ఇనుపముక్కను సాగగొడుతున్నాడు. అతని పక్క తుపాకి, దానిపక్క నాలుగైదు సైకిల్ గొట్టా లున్నాయి.

"గిదేం పనిరా కిట్టా" పున్నమ్మ.

"తుపాకే అవ్వా! తుపాకి జేత్తన్న." పని ఆపకుండ ఇనుపముక్కను కొడు తూనే ఉన్నాడు కంకబద్దలాంటి అతని చేయి వేగంగా కదులుతోంది. క్షౌరం లేక చెవుల మీది కంటా పెరిగిన వెంట్రుకల నుండి నల్లటి చెంపల మీద చెమట కారు తోంది సత్యం కండ్లు నిద్రమత్తుతో మూతలు పడుతున్నాయి అతని చిరిగిన లాగంతా తడిసిపోయింది.

పున్నమ్మ నోట మాటరాక కూర్చుండిపోయింది.

ఇనుపముక్క మీద నీల్లు పోసి తుపాకికి ఒక పక్క పెట్టి బెజ్జం గొట్టి ఆ ముక్కను దాని కతికించి మొలకొట్టాడు.

"తుపాకి జేసి ఏం జేత్తవురా ?" పున్నమ్మ.

"దొరను సంపుత." తల్లివేపు చూడకుండానే అన్నాడు క్రిష్ణ.

పున్నమ్మ క్రిష్ణను ఒళ్ళోకి తీసుకొంది. సత్యం తల్లిని కావలించుకొని– కాసేప టికి నిద్రపోయాడు.

ఆ రాత్రంతా క్రిష్ణ తుపాకి తయారు చేయడం గురించి తల్లికి చెప్పతూనే ఉన్నాడు. పున్నమ్మ "అద్దురా!" అనలేకపోయింది.

సత్యం నిదురలో కలువరిస్తున్నాడు. తొలికోడి కూసింది. క్రిష్ణ అలా చెప్ప తూనే నోరుతెరిచి నిద్రపోయాడు. మలికోడి కూసింది. పున్నమ్మ లేచి కొడుకు చేసిన తుపాకి చేతిలోనికి తీసుకొని చూసింది. సైకిల్ గొట్టాలు, కర్రముక్క అదేదో పిల్లలు ఆడుకునే కర్ర తుపాకి లాగానే తోచింది ఇంకా దానికి చాలా పనిచేయవలసిఉన్నదని పున్నమ్మకు తెలియదు. తీసి చూరులో పెట్టింది ఆమెకు తుపాకి తుడుస్తున్న నారా యణ కళ్ళల్లో మెదిలాడు. గుబగుబ కండ్లనిండా నీరు నిలిచింది.

× × ×

మిట్ట మధ్యాహ్నం– ఉత్తరకార్తె ఎండ చిటపటలాడిస్తోంది. వెంకటావు పెరడి దగ్గర ట్రాక్టర్ గుడగుడలాడుతోంది. తాలూకాకుపోయే రోడ్డు నిర్మానుష్యంగా.

ఉంది. దూరంగా పోలీసు టెంట్‌లో నుండి ఏదో బూతు పాట రేడియోలో నుండి సన్నగా వినిపిస్తుంది. పడమటి వేపు మబ్బు కుదురుకుంటోంది. రోడ్డు పక్కనున్న చింతచెట్టు కొసల్లో ఉన్న సత్యం రెండు వేళ్ళు నోట్లో పెట్టి ఈల గొట్టాడు. ఆ చింతకు వంద గజాల దూరంలోనున్న చింత కొమ్మల్లో నుండి జవాబుగా ఈల విన వచ్చింది.

వెంకట్రావుదొర గట్టయ్య గొడుగు పట్టుకోగా ఏవో మాట్లాడుతూ కిర్రుచెప్పుల మోతతో రోడ్డు మీది నుండి వస్తున్నాడు. రోడ్డు దిగి అడ్డదారిలో ఓ రెండు వందల గజాలు నడిస్తే అతని పెరడు వస్తుంది. ఆ పెరడు మార్గంలోనే ఉన్నాయి రెండు చింతలు. వెంకట్రావు మొదటి చింత దాటి యాభయి గజాలు నడిచాడు.. మొదటిచింతమీదినుండి రెండుసార్లు ఈల వినిపించింది.

"ఎవ్రరా ఈలలు గొట్టేది?" వెంకట్రావు మెడ రిక్కించి అటూ యిటూ చూశాడు.

"పోలీసోళ్ల టికాన్ల నుంచి గావచ్చు బాంచెన్– కుషీలుండి ఎవలో ఈల గొట్టి నట్టున్నది బాంచెన్.." గట్టయ్య..

"మందిసొమ్ము మంగళారతి–పీక్క తింటండ్లు లమ్డికొడుకులు–ఇంకో వారం పదిరోజులు సూసి–ఏడిదాక సల్లబడితే లమ్డికొడుకుల ఎల్ల గొట్టాలె. ఔరా గట్టిగ– ఏన్నన్న సప్పుడిన బడ్తందా? లమ్డికొడుకులు పత్తకు లేకుంట దెంకపోయిండ్లు"

"మళ్ళింక ఏమొఖం బెట్టుకొని ఊళ్ళెక తరు బాంచెన్.. ఊళ్ళెకత్తె సున్నం లకు ఎముక లేకుంద నలుసుక తినరు!" గట్టయ్య.

"ఏదో లమ్డికొడుకులు పిచ్చిలేసినట్టుజేసిరి. పనిజేసుక బతుకుతె కాదన్నా నురా!" దొర.

దొర చింతకింది కొచ్చాడు.

"ఢాం" మ్మని తుపాకి పేలింది. దొర కుడిసేతి మనికట్టుల నుండి దెబ్బ దూసుకుపోయింది. గొడుగు పారేసి గట్టయ్య పరుగందుకున్నడు. దొర నెత్తురు కారే చేతితోనే ముందు కురికిండు.

అయిదు నిమిషాలు చప్పుడేమీ లేదు. పడమటి మబ్బు ఉరిమింది.

పోలీసుల బూట్లు టకటక లాడినయ్. పోలీసులు ట్రాక్టరు వెనుక దాక్కున్న దొర దగ్గరి కురికారు, దొర బెదిరే గుండెలతో చింతచెట్టును చూయించిండు. పోలీసులు భయం భయంగా అడుగులో అడుగేసుకుంటూ– చింతమీదికి నాలుగురౌండ్లు కాల్పులు

1677

జరిపారు. సడీసప్పుడు లేదు. చింతకింది కొచ్చారు. కొమ్మల్లోకి భయం భయంగా చూశారు. కొమ్మల చాటుకు తుపాకి పట్టుకొని పదేండ్ల క్రిష్ణ అతని చేతిలో తుపాకి...

ఒక పోలీసు గురిచూసి తుపాకి ఎక్కుబెట్టాడు. అంతలోకే ఎస్. ఐ. పడుతూ లేస్తూ ఉరికొచ్చాడు. ఎక్కుపెట్టిన తుపాకిని దించమన్నాడు.

"దిగిరా! దిగిరాకుంటె సస్తవ్." ఎస్. ఐ. అరిచిండు.

"నేను రాను." క్రిష్ణ అరిచిండు.

"తుపాకి కింద పారేయ్"

"నేను పారేయ"

"సస్తవ్"

క్రిష్ణ కాసేపు మాట్లాడలేదు. ఏమనుకున్నాడో ఏమో? మెల్లెగా కిందికి దిగొచ్చాడు. అతని చేతిలోని తుపాకి గుంజుకున్నారు. అదే తుపాకి చేతులుమారి క్రిష్ణను వంగదీస్తే వెన్నుమీద గుద్దింది. క్రిష్ణ ఏడవలేదు. క్రిష్ణను అరెస్టు చేశారు.

వందగజాల దూరంలోనన్న చింతకింది నుండి ఎనిమిదేండ్ల సత్యం పరుగెత్తుతున్నాడు అతని వెంట ఇద్దరు పోలీసులు పడ్డారు. జింకపిల్లలా సత్యం చేల గట్ల మీది గుండా, పొలాల మధ్య నుండి కొండ వేపుకు పరుగెత్తాడు. పోలీసులు తలలు పేళ్లా దేసుకొని తిరిగివచ్చారు.

సత్యం అట్లా పరుగెత్తినవాడు అటు పోలీసులకు, ఇటు తల్లి పున్నమ్మకు దొరకలేదు. గత మూడేండ్ల నుండి సత్యం కోసం కొండలు కోనలు గాలిస్తూనే ఉన్నారు.

మూడు సంవత్సరాలుగా విచారణ లేకుండా క్రిష్ణ జైల్లో సత్యాన్ని తలచుకుంటూనే గడుపుతున్నాడు.

పున్నమ్మ చిరిగిపోయిన గుడ్డలతో, కంపలా పెరిగిన తలతో, గుడ్డలమూట చంకన బెట్టుకొని దేశం మీద పడి తిరుగుతోంది కనిపించిన వారినల్లా "మా సత్యం కనిపించిండా?" అని అడుగుతుంది. గొడ్లగాసే పిల్లల్లో, బరువులు మోసే పిల్లల్లో బూట్లు పాలిష్‌చేసే పిల్లల్లో, మోటార్లు తుడిసే పిల్లల్లో, జేబులుగొట్టే పిల్లల్లో, మిల్లుల్లో పనిచేసే పిల్లల్లో, అడుక్కుతినే పిల్లల్లో సత్యం కోసం వెతుకుతుంది. కాని అక్కడెక్కడా ఆమెకు సత్యం కనిపించడు.

సత్యం- పదకొండు సంవత్సరాల సత్యం- తన అన్న విముక్తి కోసం ఏ కొండల్లో తుపాకులు తయారు చేస్తున్నాడో???

(ఆధారం : ఆయుధాల చట్టం కింద అరెస్టు చేయబడి కరీంనగర్ సబ్ జైల్లో వున్న ఒక బాల నేరస్తుడు- అతను తయారుచేసిన తుపాకి..)

1678